## క్లుప్తంగా

### విఘ్నేశ్వర మండపం పనులకు శ్రీకారం



సత్తెనపల్లి: పట్టణంలోని గాంధీచౌక్‌లో ఉన్న విఘ్నేశ్వర ఆలయం వద్ద గురువారం గణేష్ ఉత్సవ కమిటీ, ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా వినాయక మండపం ఏర్పాటులో భాగంగా నూతన పుస్తకాలు విఘ్నేశ్వరుని దగ్గర ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆగస్టు 27వ తేదీన జరిగే వినాయక చవితి సందర్భంగా విఘ్నేశ్వర మండపం పనులకు అంకురార్పణ చేసే ప్రక్రియ చేపట్టారు. ఎలాంటి విఘ్నాలు లేకుండా ఈ ఏడాది కూడా గణేష్ ఉత్సవాలు జరిగే విధంగా ఆశీస్సులు కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం బాధ్యులు, విఘ్నేశ్వరుని భక్తులు పాల్గొన్నారు.

### బావులు, కుంటల్లో గంబూషియా చేపలు



క్రోసూరు: గంబూషియా చేప పిల్లలను నీటి స్థావరాల్లో వదలడం వల్ల దోమల నివారణ సాధ్యమని, దోమల లార్వాలను ఈ చేపలు తినడంతో దోమల ఉత్పత్తిని తగ్గించవచ్చునని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ గురువారం తెలిపారు. క్రోసూరు మండలంలోని పీసపాడు, ఎర్రబ్రాలెం, అనంతవరం, క్రోసూరు, విప్పర్ల తదితర గ్రామాల్లో వాడుకలో లేని బావులు, కుంటల్లో గంబుషా చేపలను వేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు ప్రహ్లాద్, ప్రేమ రాజ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### 'సారథ్యం' జయప్రదం చేయండి

అమరావతి: ఈనెల 4వ తేదీన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పల్నాడు జిల్లాలో చేపట్టనున్న సారథ్యం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ ప్రకాశం జిల్లా ఇన్చార్జి, పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకులు పునుగొళ్ళ రవిశంకర్ పిలుపునిచ్చారు. స్థానిక ధ్యానబుద్ధ సమీపంలోని హరిత రిసార్ట్స్‌లో జరిగిన పెదకూరపాడు నియోజకవర్గ కార్యశాల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గోగినేని వెంకటరమణ అధ్యక్షత వహించారు. రవిశంకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి వందల సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నూతనంగా ఎంపికైన పార్టీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు గోగినేని వెంకట రమణ, జిల్లా కార్యదర్శి సులోచనలను సత్కరించారు. రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు, అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు, పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఆలోకం సుధాకర్ బాబులు ప్రసంగించారు.

### రేపు పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఆగస్టు 2వ తేదీన పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో వేర్‌హౌస్ మేనేజర్ ఎస్.అనురాధ గురువారం మార్కింగ్ ఇచ్చారు. ఆగస్టు 2న ఉదయం 10:30 గంటలకు నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు హాజరవుతారన్నారు. రైతులకు ఆన్‌లైన్‌లో వారికి సెంటర్, తేదీని ఫోన్‌లో పంపిస్తారని, రైతులు వారికి కేటాయించిన తేదీ ప్రకారం యార్డుకు పొగాకు తీసుకొని రావాలన్నారు. రాష్ట్ర రైతు కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



# వానాకాలం.. వ్యాధుల గాలం

- అప్రమత్తతే ఆయుధం
- రోగాలు, లక్షణాలు తెలుసుకోవడం ఉత్తమం
- పరిష్కార మార్గాలపై వైద్యుల సూచనలు





బెల్లంకొండ: వాతావరణ పరిస్థితులు ప్రస్తుతం ఒక్కో విధంగా ఉంటున్నాయి. కొద్ది రోజులు వర్షాలు కురిస్తే, మరికొద్ది రోజులు తీవ్రమైన ఎండలు కాస్తూ ప్రతికూలంగా మారాయి. వాతావరణ మార్పుల వలన గ్రామాల్లో వ్యాధులు ప్రభలుతున్నాయి. ఒంట్లో నలతగా ఉండడం, జ్వరాలతో ఇబ్బంది పడడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అదే విధంగా కలుషిత నీరు, దోమలు, ఈగలు ద్వారా అతిసార, టైఫాయిడ్, చికున్‌గున్యా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. రక్త కణాలు తగ్గిపోవడంతో గ్రామాల్లో పలువురు మంచాన పడుతున్నారు. ఈ పరిస్థితులలో పరిసరాల పరిశుభ్రత, ఆహార నియమాలు పాటించడంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు కిరణ్‌కుమార్ సూచిస్తున్నారు. అదే విధంగా ముందస్తు వైద్య పరీక్షల ద్వారా రక్షణ పొందాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, వాటి లక్షణాల గురించి ఆయన వివరించారు.

**కలుషిత నీరు, ఆహార పదార్థాలతో అతిసార**

ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నిల్వ ఆహార పదార్థాలు, తాగు నీరు కలుషితం కావడం వల్ల అతిసార సంక్రమిస్తాయి. చేపలు, మాంసాహారం, అపరిశుభ్ర వాతావరణంలో వీధులలో విక్రయించే తినుబండారాలు వల్ల ఎక్కువగా ఈ వ్యాధి వస్తుంది. ఇలా వ్యాధి సోకిన వారికి విపరీతంగా వాంతులు విరోచనాలు అతిగా ఉండటం వల్ల శరీరంలో నీటి శాతం తగ్గి బలహీనంగా తయారవుతారు.

**ఈగలతో టైఫాయిడ్, కలరా**

ఇళ్ల చుట్టూ నీరు నిలబడడం, మురుగు గుంతల వల్ల ఈగలు ఎక్కువగా పుట్టుకొస్తాయి. వీటి వల్ల సాల్మానెల్లాటైపీ బ్యాక్టీరియా మనుషులకు వస్తుంది. దీంతో జ్వరం వచ్చి అది కాస్తా టైఫాయిడ్‌గా మారుతుంది. తరచూ జ్వరం వస్తుంటే రక్త పరీక్ష చేయించి వైద్యుల సలహా మేరకు మందులు వాడుకోవాలి.

**దోమలతో మలేరియా, చికున్ గున్యా, డెంగీ**

దోమ కాటు వల్ల మలేరియా, చికున్ గున్యా వ్యాప్తి చెందుతాయి. ఎనాఫిలస్ దోమ వల్ల మలేరియా వస్తుంది. తరచూ జ్వరం, తలనొప్పి, చలిజ్వరం వేదిస్తుంటే చికున్ గున్యా సోకినట్లు సంకేతం. ఇక పగటి పూట సంచరించే ఎడిస్ ఈజిప్ట్ అనే దోమకాటు వల్ల డెంగీ వస్తుంది. మోచేతులు, మోకాళ్లపై ఈ దోమలు ఎక్కువగా కుడుతుంటాయి. ఒళ్లంతా దద్దుర్లు వచ్చి తెల్లరక్త కణాలు తగ్గి నీరసించి పోతారు.

**పారిశుద్ధ్య లోపంతో హెపటైటిస్ బి**

సీజనల్ వ్యాధులలో హెపటైటిస్ బి ఒకటి. పారిశుద్ధ్య లోపం వల్లే ఈ వ్యాధి సోకుతుంది. కాలేయ సంబంధిత ఇబ్బందులు ఏర్పడి పచ్చ కామెర్లు వస్తాయి. కళ్లు, చర్మం పచ్చబడడం ఈ వ్యాధి లక్షణాలు. వైద్యం పొందుతూ కాచి చల్లార్చిన నీరు తాగాలి.

డాక్టర్ కిరణ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి

# మున్సిపల్ కార్యాలయం అవినీతిమయం



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు

- వన్‌టైమ్ సెటిల్‌మెంట్లు, ఏజెంట్ల ద్వారా డబ్బులు వసూళ్లు
- పట్టణ ప్రణాళికా విభాగంలో భారీ అవినీతి
- మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తురక మేరీగ్రేస్ మండిపాటు
- వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం



మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి

సత్తెనపల్లి: పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన మున్సిపల్ కార్యాలయంలో ఆఫీసు సమయం అయిపోయాకే అన్ని పనులు జరుగుతున్నాయని మున్సిపల్ ఫ్లోర్‌లీడర్, 31వ వార్డు కౌన్సిలర్ తురక మేరీ గ్రేస్ మండిపడ్డారు. పట్టణంలోని పురపాలక సంఘ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన గురువారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తురక మేరీగ్రేస్ మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో వన్‌టైం సెటిల్మెంట్లు, ఏజెంట్ల ద్వారా డబ్బు వసూళ్లు జరుగుతున్నాయన్నారు. పట్టణ ప్రణాళిక విభాగంలో భారీ అవినీతి చోటు చేసుకుందని, సచివాలయ ఉద్యోగుల ద్వారా టీపీఓ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇటీవల తాను టీపీఓ రాధాకృష్ణకి ఓ పని విషయమై ఫోన్ చేస్తే కౌన్సిలర్‌కు మున్సిపాలిటీతో పని ఏంటని, ఏదైనా ఉంటే ఆర్డీతో మాట్లాడుకోమని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారన్నారు. సచివాలయ ఉద్యోగులు 95 శాతం మంది కనీస సమయపాలన కూడా పాటించడం లేదన్నారు.

- డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రంగిశెట్టి సుమన్‌కుమార్ పట్టణంలోని 8వ రెవెన్యూ వార్డులో ప్రార్థనా మందిరానికి ఆస్తి పన్ను మినహాయింపు ఇవ్వాలనే అంశంపై మాట్లాడుతూ మొదట ఇంటి నిర్మాణం చేసి తర్వాత ప్రార్థన మందిరంగా మారిస్తే ఎందుకు ఆస్తి పన్ను మినహాయింపు ఇవ్వాలని ప్రశ్నించారు. దీనిపై ఆర్వో అప్పారావు మాట్లాడుతూ స్థానిక ప్రజలను విచారించామని, ఎవరు ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదన్నారు. కో ఆప్షన్ మెంబర్ కొనతం స్వాతి, 6వ వార్డు కౌన్సిలర్ సదనం సత్యవాణి, 22వ వార్డు కౌన్సిలర్ శెట్టి ఆనంద్, 5వ వార్డు కౌన్సిలర్ షేక్ సలీం, 11వ వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్‌లు పట్టణంలోని పలు సమస్యలను కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. అజెండాలోని అన్ని అంశాలను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు పాల్గొన్నారు.

# ముప్పాళ్ల ఎంఈఓ–1గా సుధారాణి



సుధారాణిని అభినందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

ముప్పాళ్ళ: మండల విద్యాశాఖాధికారి–1గా పోలినేని సుధారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సంతమాగులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పనిచేస్తూ పదోన్నతిపై మండల విద్యాశాఖాధికారిగా సుధారాణి ఇక్కడికి వచ్చారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎంఈఓ–1 ను కలిసి అభినందనలు తెలిపారు. యూటీఎఫ్ నాయకులు ముప్పా సురేష్, కొమిరిశెట్టి విజయ్, ఎస్టీయూ నాయకులు రామారావు, వెంకట్రావు, రాధాకృష్ణ, ఎన్‌టీఏ నాయకులు కే.నాగేశ్వరరావు, బుల్లిబాబు, ఏపీటీఎఫ్ నాయకులు బుల్లిబాబు, ఐతమ్‌రాజు, శ్రీనివాసరావు, మ్యాథ్స్ ఉపాధ్యాయులు కే.సాయిజగన్నాథం తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

**అమరావతి ఎంఈఓ–1గా కంచర్ల ప్రసాద్**



అమరావతి: మండల విద్యాశాఖాధికారి–1గా కంచర్ల ప్రసాద్ గురువారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంఈఓగా ఉన్న పెదకూరపాడు ఎంఈఓ ఏకుల ప్రసాదరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు ఎస్‌పీకేహెచ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కంచర్ల ప్రసాద్ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

### రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్‌కు రూ. లక్ష విరాళం



సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్‌కు పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల లో తెలుగు పండితుడిగా పనిచేసి రిటైర్డ్ అయ్యి ఇటీవల మృతి చెందిన కొల్లిపర రాధాకృష్ణమూర్తి జ్ఞాపకార్థం ఆయన సతీమణి జానకి రూ.లక్ష విరాళం గురువారం అందించారు. పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో కొల్లిపర రాధాకృష్ణమూర్తి చిత్రపటాన్ని ఆమె ఆవిష్కరించి సంఘానికి అసోసియేషన్ చేస్తున్న సేవలను కొనియాడారు. అసోసియేషన్ బాధ్యులు జానకిని పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. జిల్లా సెక్రటరీ ఆదెయ్య, జిల్లా ట్రెజరర్ ఎంఎస్ఆర్.ప్రసాద్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కేబీఆర్జే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### రక్తదానం ప్రాణదానం



ముప్పాళ్ళ: రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానం ద్వారా ఒక కుటుంబాన్ని కాపాడవచ్చని జిల్లా రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ కే.ఎం.ఎస్.వి. శ్రీనివాసగుప్త చెప్పారు. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని తహసీల్దార్ కె.నగేష్, వైస్ చైర్మన్ కేఎంఎస్‌వీ శ్రీనివాస గుప్త ప్రారంభించారు. మండల పరిధిలోని వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, ప్రభుత్వ సిబ్బంది శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. మొత్తం 18 మంది స్వచ్ఛందంగా శిబిరంలో పాల్గొన్నట్లు తహసీల్దార్ కె.నగేష్ తెలిపారు. కార్యక్రమంలో మేనేజింగ్ కమిటీ సభ్యులు డా. ఎల్.సృజన, వైద్యులు డా. మురళీధర్, వీఆర్వోలు, వీఆర్ఏలు, రెడ్‌క్రాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### శివాలయంలో మంచినీటి బోరు ఏర్పాటు



బెల్లంకొండ: మండల కేంద్రంలోని బెల్లంకొండ శివాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు గాలం రామకృష్ణ గురువారం మంచినీటి బోరు వేయించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తాగునీటి సమస్య ఉండడంతో సొంత డబ్బులు వెచ్చించి బోరును ఏర్పాటు చేశారు. దీనిపై భక్తులు, ఆలయ అర్చకులు హర్షం వ్యక్తం చేసి, రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు పీఎస్‌కే మౌలాలి, గడిపర్తి బాబు, బడా బచ్చా తదితరులు పాల్గొన్నారు.

### గొర్రెల కాపరులకు మందులు పంపిణీ

రాజుపాలెం: ఫుట్‌రాట్(గిట్టల మధ్య పుండ్లు) వచ్చిన గొర్రెల గిట్టలను ప్రతీరోజు యాంటీబయాటిక్ ద్రావణంతో శుభ్రం చేయాలని పశువైద్యాధికారి వీరయ్య తెలిపారు. సుమారు 20మంది గొర్రెల కాపర్లకు ఫుట్‌బాత్ ద్రావణాలు, యాంటీబయాటిక్ ఇంజక్షన్‌లు గురువారం అందజేశారు. ప్రతీరోజు గిట్టల మధ్య ఏర్పడిన పుండ్లను ద్రావణాలతో శుభ్రం చేస్తే త్వరగా మానతాయని కాపర్లకు సూచించారు.

### సీఈఓ ఉద్యోగ విరమణ

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈవోగా పనిచేస్తున్న కనకా శివారెడ్డి గురువారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామంలోని జీడీసీసీ బ్యాంక్ కార్యాలయంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు విధి నిర్వహణలో అన్ని విధాల సహకరించిన సొసైటీ బ్యాంక్ ఉద్యోగులకు రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ మిరియాల కోటేశ్వరరావు, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, సీఈవోలు వెంకటేశ్వరరెడ్డి, వీరారెడ్డి, లక్ష్మీరెడ్డి, దీపక్, వెంకటేశ్వరరెడ్డి, యూనియన్ నాయకులు డి.శ్రీనివాసరావు, జె. నాగప్రసాద్, వై. నారాయణ, లక్ష్మీనారాయణ, కంటు శ్రీనివాసరావు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# చేనేతలపై వేధింపులు అధికమయ్యాయి

- ధర్మవరంలో చేనేత కుటుంబంపై దౌర్జన్యం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి
- జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిల్లపల్లి సత్యం



సమావేశంలో పాల్గొన్న సత్యం, ఇతర నాయకులు

పెదకూరపాడు: సత్యసాయి జిల్లా చేనేత కేంద్రమైన ధర్మవరంలో చేనేత కార్మికుడు రమణ కుటుంబంపైన తన అనుచరులతో కలిసి దాడి చేసి హింసించి హత్యాయత్నం చేయబోయిన అక్రమ వడ్డీ వ్యాపారి రాజాను కఠినంగా శిక్షించాలని జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిల్లపల్లి సత్యం డిమాండ్ చేశారు. గురువారం పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామంలో జరిగిన చేనేత కార్మికుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుడు రమణ దంపతులు ఎంత వేడుకున్నా మానవత్వం చూడకుండా దారుణంగా హించించిన వడ్డీ వ్యాపారి మీద హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ధర్మవరం లో గత రెండు నెలల వ్యవధిలో ముగ్గురు చేనేత కార్మికులు వడ్డీ వ్యాపారుల ఆగడాలు భరించలేక ఆత్మహత్య చేసుకొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో లోతైన దర్యాప్తు చేసి నిందితులపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక్క ధర్మవరంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా కూడా అక్రమ వడ్డీ వ్యాపారుల ఆగడాలు భరించలేక చేనేత కార్మికులు ఆత్మహత్యలకు బలైపోతున్నారనీ, రైతాంగానికి తోడ్పాటు అందించిన విధంగానే చేనేత కార్మికులకు రుణమాఫీ సౌకర్యం కల్పించాలని, నూలు పట్టు రాయితీలను ఆదరణ పథకం ద్వారా నాణ్యమైన అధునాతన మగ్గాలు అందించాలని, నేతన్న నేస్తం పథకాన్ని త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షుడు అనుముల వెంకట్రావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బందారు వెంకటేశ్వర్లు, మహిళా కమిటీ అధ్యక్షురాలు సామ్రాజ్యం, రామారావు, బ్రహ్మయ్య, రాములు తిరుపతిరావు పాల్గొన్నారు.

# విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

**వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు**



సమావేశంలో మాట్లాడుతున్న రవిబాబు, తదితరులు

క్రోసూరు: క్రోసూరులోని ఆమంచి విజ్ఞాన కేంద్రంలో తిమ్మిశెట్టి హనుమంతరావు అధ్యక్షతన మండల ప్రజావేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ విద్యుత్ మీటర్లకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలపై ఎటువంటి విద్యుత్ భారాలు ఉండవని చెబుతూ, మరొకపక్క సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15వేల కోట్లు వసూలు చేసేందుకు సిద్ధమైందని విమర్శించారు. అందులో భాగంగా ఇప్పటికే రూ. 2750 కోట్లు వసూలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల ధనాన్ని ఏ స్థాయిలో కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చూస్తుందో అర్థమవుతుందన్నారు. అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడం అంటే పూర్తిగా విద్యుత్తును ప్రైవేటీకరించడమేనన్నారు. ప్రజలు పార్టీలకతీతంగా వ్యతిరేకించడం ద్వారానే ఈ స్మార్ట్ మీటర్ల భారాలని ఎదుర్కోగలమన్నారు. ప్రజాసంఘాల నాయకులు రావెళ్ల వెంకటేశ్వర్లు, ఆవుల ఆంజనేయులు, పోతుగంటి నాగేశ్వరరావు, ఏపూరి వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ నాయకులు నందిగం దాసు, జి.ఎలిసమ్మ, ఎస్.కె జాన్‌బీ, కంచేటి పెద్ద బ్బాయి, బురిశైదా, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



శ్రీనివాసరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ జైబున్నీస్సా, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

సత్తెనపల్లి: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు ప్రజల నుంచి ఎల్లప్పుడూ మన్ననలు లభిస్తాయని సత్తెనపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు షేక్ ఎలవర్తిపాటి జైబున్నీసా అన్నారు. గత 32 సంవత్సరాలుగా పంచాయతీ రాజ్ శాఖలో బాధ్యతలు నిర్వహించిన సత్తెనపల్లి డిప్యూటీ ఎంపీడీఓ అన్నపరెడ్డి శ్రీనివాసరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా పట్టణంలోని మన్నెం రెసిడెన్సీలోని కుసుమ ఫంక్షన్లలులో సత్తెనపల్లి ఎంపీడీఓ బండి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సత్తెనపల్లి ఎంపీడీఓ బండి శ్రీనివాస రెడ్డి, రాజుపాలెం ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని డిప్యూటీ ఎంపీడీఓలు హాజరై శ్రీనివాస రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి దంపతులను ఘనంగా సత్క రించారు.

# ఇళ్ల సర్వే పారదర్శకంగా పూర్తిచేయాలి





మాట్లాడుతున్న ఎంపీడీఓ సీతారామయ్య

శావల్యాపురం: కేంద్ర ప్రభుత్వ సారథ్యంలో చేపడుతున్న ఇళ్ల సర్వే కార్యక్రమం పారదర్శకంగా చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీర్లు సర్వేయర్లు పంచాయతీ కార్యదర్శులకు సర్వే ప్రక్రియపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ మండలంలోని కనమర్లపూడి, శానంపూడి, కొత్తలూరు, కారుమంచి, వేల్పూరు, పోట్లూరు ఆరు రెవెన్యూ గ్రామాల్లో ఇళ్లను ఖాళీ స్థలాలను రోవర్ యంత్ర పరికరం ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో కొలతలు తీసి సంబంధిత యాజమాని సమగ్ర వివరాలు సేకరించి ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. డాక్యుమెంట్లు తగిన ఆధారాలు చూపని లబ్ధిదారులకు సంబంధించి గ్రామపెద్దల సమక్షంలో విచారణ చేసిన అనంతరం వారి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, మండల సర్వేయర్ రవికుమార్, మాస్టర్ ట్రైనర్ సర్వేయర్ సలీమ్, తదితరులు పాల్గొన్నారు.